క్లుప్తంగా

## హ్యాండ్ రైటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




పామర్రు: మదర్‌థెరిస్సా చిల్డ్రన్ డెవలప్‌మెంట్ సొసైటీ వారు నిర్వహించిన హ్యాండ్ రైటింగ్, కలరింగ్ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఏఎస్ఎం ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్లో విజేతలైన విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 10వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించిన హ్యాండ్ రైటింగ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఎం.మామ్నిత శ్రీ, హరిణికృష్ణ, వినీల విజేతలుగా నిలిచారన్నారు. అదేవిధంగా కలరింగ్ పోటీల్లో నాగవైష్ణవి, పార్థ సంజయ్, రాహుల్ గెలుపొందారని తెలిపారు.

## వక్ఫ్ యాక్ట్ సవరణ బిల్లును వ్యతిరేకించండి

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వక్ఫ్‌యాక్ట్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్లా అన్నారు. మంగళవారం స్థానిక ముబారక్ సెంటర్ బైపాస్ రోడ్‌లోని అంజుమాన్ భవన్‌లో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్లా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు వ్యవహారంలో చేస్తున్న సవరణలు లౌకిక వాదానికి విరుద్ధం అన్నారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దూస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, అబ్దుల్ హమీద్, మహ్మద్ ఖాసీం, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అయిన పోలీసులకు సత్కారం

గుడివాడరూరల్: గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ఉద్యోగులను ఎస్‌ఐ ఎస్.చంటిబాబు ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. పోలీస్ కానిస్టేబుళ్లు కరేటి రామచంద్ర, రాజులపాటి వీరబాబు, పోలగాని ఏడుకొండలు, అబ్దుల్ రెహమాన్‌లు బదిలీ కాగా వీరిని స్టేషన్ సిబ్బంది సమక్షంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పచ్చదనాన్ని పరిరక్షించాలి



గుడివాడ టౌన్: స్వచ్ఛభారత్‌లో భాగంగా పచ్చదనాన్ని పరిరక్షించాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇండియా డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరిరావు అన్నారు. స్థానిక లయన్స్‌క్లబ్ మల్టీ కంటి ఆస్పత్రి ప్రాంగణంలో మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ రీజినల్ చైర్మన్ ఉపద్రష్ట రాంబాబు, క్లబ్ అధ్యక్షుడు సతీష్, కార్యదర్శి జి.వేణు, కోశాధికారి పి.సుబ్రహ్మణ్యం, సభ్యులు కృష్ణ కిషోర్, వాసు పాల్గొన్నారు.

## వీరాంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద వేంచేసియున్న వీరాంజనేయస్వామి ఆలయంలో మార్గశిర మాసం తొలి మంగళవారం కావడంతో ఆలయంలో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పాల పొంగళ్లను వండి స్వామికి నివేదన చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు, సహాయకులు బి ఫణీకుమార్, శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేశారు. ఆలయ ఈఓ ఆర్ గంగాశ్రీదేవి పర్యవేక్షించారు.

## పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

మండవల్లి: పారిశుద్ధ్యానికి ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ అన్నారు. గ్రామంలోని పలు ప్రదేశాల్లో దట్టంగా పెరిగిన తుప్పలను సర్పంచ్ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రోడ్ల వెంబడి, జనావాస ప్రాంతాల్లో పెరుగుతున్న తుప్పలను, చెత్త చెదారాలను ఎప్పటికప్పుడు తొలగిస్తే పరిశుభ్రత నెలకుంటుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

# అసంపూర్తిగా పాఠశాలల భవనాలు

- నాడు–నేడు పనులకు నిధులు నిలిపేసిన కూటమి సర్కార్
- విద్యార్థులకు తప్పని తిప్పలు

కూటమి ప్రభుత్వం కేవలం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను నిలిపివేసేవిధంగా చేస్తున్నట్లు పోకడలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో నాడు–నేడు పేరిట విద్యాభివృద్ధి కోసం పాఠశాలల్లో చేపట్టిన తరగతుల భవనాల నిర్మాణాలను నిలిపివేసింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారి తల్లిదండ్రుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గుడ్లవల్లేరులో అసంపూర్తిగా పాఠశాల భవన నిర్మాణం



కొతవరంలో అరకొరగా నిర్మాణంలో ఉన్న స్కూల్ భవనం

గుడ్లవల్లేరు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సర్కార్ బడుల్లో విద్యా సంస్కరణలను అమలు చేసింది. ఇందులో భాగంగా నాడు–నేడు పథకం ద్వారా గుడ్లవల్లేరు మండలంలో పాఠశాలలను ఎంపిక చేసి, నూతన భవన నిర్మాణాలకు రెండు విడతలుగా నిధులు మంజూరు చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే పాఠశాలల భవన నిర్మాణాలకు సంబంధించిన నిధులను నిలిపివేసింది. దీంతో భవన నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయి కూటమి ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధిని వెక్కిరిస్తున్నాయి. అసంపూర్తిగా భవన నిర్మాణాలు ఉండటంతో విద్యార్థులకు తరగతి గదుల కొరత ఏర్పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకే తరగతి గదిలో అన్ని తరగతుల విద్యార్థులను కూర్చోబెట్టడంతో వారు పాఠాలు వల్లివేసేటపుడు పక్కనున్న వేరే తరగతుల విద్యార్థులకు వారికి వేరే టీచర్ చెప్పే పాఠాలు అర్థంగాక తలలు పట్టుకుంటున్నారు.

### 3,195 మంది విద్యార్థులు

మండలంలో 65 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 3,195 మంది విద్యార్థులు ఆయా పాఠశాలల్లో అభ్యసిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు తొలి విడతలో భాగంగా 20 స్కూళ్ల భవనాలకు రూ.2.70 కోట్లు విడుదల చేసి నిర్మాణాలకు ఖర్చు చేసింది. మలి విడతలో 21 పాఠశాలలకు గానూ రూ.6.86 కోట్లు కేటాయించింది. ఇందులో కొన్ని భవనాలు పూర్తయ్యాయి. మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నిధులు నిలిపివేసింది. దీంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇరుకు గదుల్లోనే చదువులు కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టి నూతన భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### పిల్లలు తిప్పలు పడుతున్నారు



అన్ని తరగతుల విద్యార్థులను నలుగురు మాస్టార్లు ఒకే తరగతి గదిలో కూర్చోబెట్టి బోధిస్తుంటే విద్యార్థులకు అర్థంగాక తిప్పలు పడుతున్నారు. దీనిపై మా స్కూల్‌కు సంబంధించిన అందరు పిల్లల తల్లిదండ్రులు ఆవేదనగా ఉన్నారు. మా స్కూల్‌పై నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి.

– డి.అశ్విని శాంతి, గుడ్లవల్లేరు ఎంపీపీఎస్–2 చైర్మన్

### విద్యాభివృద్ధి ఎలా?



కేవలం గత ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పని చేయటమే అజెండాగా పెట్టుకోవడం దారుణం. ఇలా అయితే విద్యాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది. పాఠశాలల భవన నిర్మాణాలను నిలిపివేయటంతో విద్యాభివృద్ధి కుంటుపడుతుంది. విద్యాభివృద్ధిని పెంపొందించి కూటమి ప్రభుత్వ విధానాలను చాటుకోవాలి.

– ఎస్‌కే సాదిక్‌బాబు, ఏఐఎస్ఎఫ్ కృష్ణా జిల్లా కార్యదర్శి

### భవనాలను అందుబాటులోకి తెస్తాం

ప్రభుత్వ నిధుల కేటాయింపును బట్టి చర్యలు తీసుకుంటాం. త్వరలో పాఠశాలల నూతన భవనాలను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.

– జి.గోపాల్, ఎంఈఓ

## 6న జాబ్ మేళా

మొవ్వ: స్థానిక వేమూరి సుందరరామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల్లో ఈ నెల 6వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎస్. మాధవి తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకు, నిట్, డీ మార్ట్ తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసి ఉన్న నిరుద్యోగ యువత, చివరి సంవత్సరం చదువుతున్న డిగ్రీ విద్యార్థులు కూడా ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని జె.కె.సి సమన్వయకర్త డా. ఏ.వి.వి.వి. మల్లేశ్వరమ్మ పేర్కొన్నారు.

## ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

గుడివాడరూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గుడివాడ వన్ టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు పోలీసుల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వాహన రికార్డులతో పాటు లైసెన్స్‌లు కూడా కలిగి ఉండాలన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

మండవల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం 600 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అరెకపూడి రాధాకృష్ణ చౌదరి ఆర్థిక సాయంతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. హెచ్ఎం ప్రసాద్, నిమ్మగడ్డ శశికళ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

గుడివాడ టౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మెడికల్ కాంట్రాక్ట్ (సఫాయి) కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గం అన్నారు. సామాన్య చిరు ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే జీవనం ఎలా గడపాలి అని ప్రశ్నించారు. రూ. 16 వేలు జీతం ఇస్తామని చెప్పి కార్మికులకు పావిడెంట్ ఫండ్ కడుతున్నట్లుగా మోసం చేస్తూ కేవలం రూ. 8 వేలు మాత్రమే జీతం చెల్లించడం దారుణమన్నారు. ప్రావిడెంట్ ఫండ్ కూడా ప్రభుత్వమే చెల్లించి రూ. 18 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు గూడపాటి ప్రకాశ్‌బాబు, కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణ, కార్మికులు వి. రమణమ్మ, కె. విజయలక్ష్మి, వి. ధనలక్ష్మి, ఎం. మేరమ్మ, బి. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



కొతవరం పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

గుడ్లవల్లేరు: ఆశ వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ప్రభుత్వం ఇవ్వాలని కొతవరం పీహెచ్‌సీ ఆశ వర్కర్ల నాయకురాలు సీహెచ్.లక్ష్మి డిమాండ్ చేశారు. కొతవరం పీహెచ్‌సీ ఎదుట లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఆశ వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 62ఏళ్లకు సర్వీస్ పెంచాలన్నారు. ఏఎన్ఎం చదువుకున్న ఆశ వర్కర్లకు నర్సులుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. ఆశ వర్కర్ల నాయకురాలు ఇందిర మాట్లాడుతూ రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రభుత్వం ఇవ్వాలన్నారు. కొతవరం పీహెచ్‌సీ ఆశ వర్కర్ల నాయకురాళ్లు ఎస్.స్వర్ణలత, బి.వరలక్ష్మి, సీహెచ్.ఝాన్సీ, జి.దివ్య, ఎస్.మేరీ, వై.జ్యోత్స్న, కె.వాణి, టి.ప్రమీలారాణి, బి.కమలకుమారి, రాణీకుమారి, జి.మరియమ్మ, జె.ఇందిర, డి.పెద్దింట్లమ్మ, కె.మౌనిక, ఎస్.సుబ్బమ్మ, ఎస్.దేవి తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామికి 183 కేజీల పటిక బెల్లం సమర్పణ



ఆలయానికి పటిక బెల్లం అందజేస్తున్న దాతలు

పామర్రు: స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయానికి భక్తులు 183 కేజీల పటిక బెల్లం అందజేశారని ఈఓ పీవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. స్థానిక ఆలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గుడ్లవల్లేరు మండలం పెసరమిల్లి గ్రామ వాస్తవ్యులు అల్లూరి సురేష్‌బాబు, కుమారుడు అల్లూరి దీపక్ హనుమాన్ సాయి గతంలో స్వామికి పటిక బెల్లం తులాభారం వేసి ఇస్తామని మొక్కుకున్నల తెలిపారు. ఈ నేపథ్యంలో తండ్రీకొడుకుల బరువు 183 కేజీలు కావడంతో దానికి సమానంగా పటిక బెల్లాన్ని కాటా వేసి స్వామికి సమర్పించినట్లు తెలిపారు.

# పంటల బీమా చేయించుకోవాలి



కోడూరులో జీవామృతం తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ

ముదినేపల్లి రూరల్ : మినుము పైరుకు ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి అన్నారు. మండలంలోని కోడూరు, పెదపాలపర్రులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఏడీఏ మాట్లాడారు. పంటలు బీమా వల్ల బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. తెగుళ్లు, పురుగులు, ప్రకృతి వైపరీత్యాలతో పైరుకు నష్టం వాటిల్లితే బీమా పరిహారం పొందవచ్చన్నారు. బీమా ప్రీమియం ఎకరానికి కేవలం రూ.60 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ మినుము పైరుకు వైరస్ తెగుళ్లు సోకకుండా విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో జీవామృతం తయారీ విధానం ప్రయోజనాలను రైతులకు వివరించారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి




సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ

ముదినేపల్లి రూరల్ : జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జెడ్పీ సీఈఓ జయరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి విఘాతం కలిగిస్తాయన్నారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ జనార్దన్, అధ్యాపకురాలు జానకీదేవి, ఉపాధ్యాయురాలు సాయిలక్ష్మి, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

# దివ్యాంగులను ప్రతిఒక్కరూ ఆదరించాలి



తోట్లవల్లూరులో విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంపీడీఓ రవికాంత్



పామర్రులో దివ్యాంగులకు బహుమతులను అందజేస్తున్న ఎంపీడీఓ జ్యోతి

పామర్రు: దివ్యాంగులను ప్రతిఒక్కరూ ఆదరించాలని ఎంపీడీఓ కె.జ్యోతి అన్నారు. స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు ఎంఈఓ–2 పద్మవాణి మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని ఉన్నంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో బాలికల పాఠశాల హెచ్ఎం కె.లక్ష్మీకుమారి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు కె.మరియన్న తదితరులు పాల్గొన్నారు.

**ఎలకుర్రులో..**

ఎలకుర్రు గ్రామంలోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య (కేడీబీ)ట్రస్టు ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు పోతురాజు పాల్గొన్నారు.

**మొవ్వలో...**

మొవ్వ: దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధరాజు పేర్కొన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక భవిత సెంటర్‌లో నిర్వహించారు. తహసీల్దార్ మస్తాన్, ఎంఈఓలు శివశంకర్, శ్రీలక్ష్మి, ఎస్ఎంకే జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎస్ శ్రీదేవి, ఎంపీపీఎస్ మొవ్వ(ఆర్) హెచ్ఎం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**గుడ్లవల్లేరులో..**

గుడ్లవల్లేరు: దివ్యాంగులు మానసిక బలంతో ఉంటారని ఎంఈఓ జి.గోపాలరావు అన్నారు. వికలాంగుల దినోత్సవ సందర్భంగా మంగళవారం ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి, విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం వారితో కేక్ కట్ చేయించారు.

**దివ్యాంగులకు సముచిత స్థానం**

పామర్రు(తోట్లవల్లూరు): దివ్యాంగులకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని ఎంపీడీఓ రవికాంత్ అన్నారు. తోట్లవల్లూరు మండల ప్రజా పరిషత్ పాఠశాలలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ–2 సురేష్ మాట్లాడుతూ ప్రతి బుధవారం భవిత కేంద్రంలో జరిగే ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఈఆర్పీ ఎన్. నిరుపమ, టీ పద్మావతి పాల్గొన్నారు.

**లోకుమూడిలో..**

మండవల్లి: లోకుమూడి భవిత స్కూల్లో దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం లోకుమూడి హైస్కూల్ హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఎంఈఓలు డి.రామారావు, బి.రత్నసునాదం చేతులమీదుగా ఆటల పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. కైకలూరు సత్యసాయి సేవా సమితి 10 కుర్చీలను వీరికి బహుమతిగా అందజేశారు. కూచిపూడి నృత్య కళాకారిణి దివ్వెల జూషిత నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. ఫిజియోథెరపిస్ట్ కె సునీత, ఐఈఆర్‌టీలు పాల్గొన్నారు.

**దివ్యాంగులతో ప్రేమగా మెలగాలి**

గుడివాడరూరల్: దివ్యాంగులతో ప్రేమగా మెలగాలని ఎంపీడీఓ విష్ణుప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఏజీకే మున్సిపల్ హైస్కూల్లో జిల్లా సమగ్ర శిక్ష, గుడివాడ భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ ఎంకె నీలాంబరం, ఎంఈఓ–2 బి.బాలాజీ, ఏజీకే హెచ్ఎం నరసాంబ, ఆంధ్ర నలంద మున్సిపల్ స్కూల్ హెచ్ఎం పి.లక్ష్మీస్రవంతి పాల్గొన్నారు.



గుడివాడలో బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

**పెదపారుపూడిలో..**

పెదపారుపూడి: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే భవిష్యత్ ఉంటుందని ఎంపీడీఓ సీతామహాలక్ష్మి అన్నారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో దివ్యాంగులను మంగళవారం నిర్వహించారు. అనంతరం దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ఎంఈఓ బి. శ్రీనివాస్, ఎంపీడీఓ సీతామహాలక్ష్మి బహుమతులు అందజేశారు.



గుడివాడ రీహాబిటేషన్ సెంటర్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

**మానసికంగా ఉల్లాసంగా ఉండాలి**

గుడివాడ టౌన్: దివ్యాంగులు మానసికంగా ఉల్లాసంగా ఉన్నప్పుడే వారు తమలోని లోపాలను మర్చిపోయేందుకు అవకాశం ఉందని ట్రాఫిక్ ఏఎస్‌ఐ వి.భాగ్యవతి అన్నారు. మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక చౌదరిపేటలోని శిరీష రీహాబిటేషన్ సెంటర్‌లో దివ్యాంగ బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. యాదవ సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ పాల్గొన్నారు.



కైకలూరులో బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

**కైకలూరులో..**

కైకలూరు: దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని ఎంఈఓలు రామారావు, శ్రీనివాసరావు పేర్కొన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కైకలూరు భవిత సెంటర్‌లో అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. పాఠశాలల హెచ్ఎంలు రామారావు, ఈషా, విశ్రాంత హెచ్ఎం పార్వతీశం, ఐఈఆర్‌టీఎస్ వెంకటలక్ష్మి, సుధాకర్ పాల్గొన్నారు.



లోకుమూడిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ–2 రత్నసునాదం



గుడ్లవల్లేరులో విద్యార్థులతో కేక్ కట్ చేయిస్తున్న ఎంఈఓ గోపాలరావు



మొవ్వలో దివ్యాంగ చిన్నారులకు బహుమతులను అందజేస్తున్న అతిథులు

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడరూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు ద్వారా ధాన్యాన్ని రైతులు విక్రయించుకుని గిట్టుబాటు ధర పొందాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.పద్మావతి పేర్కొన్నారు. పట్టణంలోని బేతవోలు రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ధాన్యం అమ్ముకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల వసతులను కల్పించినట్లు పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించి, న్యాయమైన ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రమాదేవి, ఏఓ అనంతలక్ష్మి, ఎంఈఓలు, సాయి, ప్రదీప్, వీఏఏ ఇమ్రాన్ పాల్గొన్నారు.

## నీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా జరగాలి

గుడివాడ టౌన్: నీటి సంఘాల ఎన్నికలు పూర్తి పారదర్శకంగా జరగాలని ఇరిగేషన్ ఈఈ కొడాలి బాబు అన్నారు. మంగళవారం స్థానిక వీకేఆర్, వీఎన్‌బి అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల్లో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంఘాల ఎన్నికలు మూడు అంచలుగా జరుగుతాయన్నారు. దిగువ స్థాయి జరిగే ఎన్నికలు కీలకంగా ఉంటాయి కనుక ఎన్నికల అధికారులు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.